రేవనపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న అనితారామచంద్రన్, కలెక్టర్ హనుమంతు కె. జెండగే, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్

భూదాన్‌పోచంపల్లి, మే 19 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ ఆదేశించారు. ఆదివారం భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి, పోచంపల్లి గ్రామాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తెచ్చి ఎన్ని రోజులైంది, ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యం ఉందా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. మిల్లుల వద్ద వెంటనే ధాన్యం దిగుమతి చేసుకోవాలని, సకాలంలో లారీలు రాక అకాల వర్షాలతో ధాన్యం తడుస్తున్నదని రైతులు ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం బస్తాలను త్వరగా దిగుమతి చేయించాలని, వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

మిల్లులకు ఇచ్చిన కెపాసిటీ పూర్తి చేయాలని, రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులపై పట్టాలు కప్పి ఉంచాలని రైతులకు సూచించారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ హనుమంతు కె. జెండగే, అదనపు కలెక్టర్ బెన్ షాలోమ్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ గోపికృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారి శ్రీనివాస్‌రెడ్డి, చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ బాల్‌రెడ్డి, రైతులు ఉన్నారు.

క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలి

- చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్

ఉమ్మడి నల్లగొండ జిల్లా చెస్ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు

బొడ్రాయిబజార్, మే 19 : క్రీడల్లో గెలుపోటములు సహజమని, విద్యార్థినీ విద్యార్థులు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకుని గెలుపు ఓటమిని సమానంగా స్వీకరించాలని చెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కిరాణ ఫ్యాన్సీ మార్చంట్స్ భవనంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి అండర్-7, 13, 17 బాల బాలికల చెస్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. అండర్-7 బాలికల విభాగంలో శాన్వి కార్తీక, బాలుర విభాగంలో యజత్‌రెడ్డి, అండర్-13 బాలికల విభాగంలో అనంతలక్ష్మి, బాలుర విభాగంలో కమల్‌తేజ్, అండర్-17 బాలికల విభాగంలో దివ్య భవాని, బాలుర విభాగంలో సాయి శ్రీనిత్‌రావు ప్రథమస్థానంలో నిలువగా బహుమతులు, షీల్డ్‌లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎల్.సతీశ్‌కుమార్, లయన్స్ క్లబ్ ట్రెజరర్ బెజగం ఫణి, లయన్స్ క్లబ్ మెంబర్‌షిప్ చైర్మన్ ముద్ద భిక్షపతియాదవ్, లింగారెడ్డి, వెంకటమురళి, ప్రసాద్, లోడె కవిత, కళ్యాణ్, సందీప్ పాల్గొన్నారుపాల్గొన్నారు.

కళను కాపాడుకోవాలి

- తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీరామ్

కళా సమ్మేళనంలో మాట్లాడుతున్న వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాము

బొడ్రాయిబజార్, మే 19 : నాడు చేతి రాతల ద్వారా ప్రజలను చైతన్యం చేసి ప్రభుత్వాలను నిలబెట్టిన వాల్ పెయింటింగ్ కళను కాపాడుకోవాలని, వాల్ పెయింటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాలు పరిష్కరించాలని తెలంగాణ వాల్ పెయింటింగ్ ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గాజుల శ్రీరామ్, గౌరవ సలహాదారు మీసాల నాగేశ్వర్‌రావు అన్నారు. తెలంగాణ వాల్ పెయింటర్స్ అసోసియేషన్ ఖమ్మం, నల్లగొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక లక్ష్మి గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కళా సమ్మేళనంలో వారు మాట్లాడారు. అసోసియేషన్ ద్వారా వాల్ పెయింటర్స్‌కు అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు ట్రేడ్ యూనియన్‌గా మార్చడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ రాయితీలు, సంక్షేమ పథకాలు అందుకోలేని పరిస్థితుల్లో ఉన్న కళాకారులను గుర్తించి ఆదుకునేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి వాల్ పెయింటర్‌కు సంఘం తరపున ఈపీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వాల్ పెయింటర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సీతారాములు, రవి, గురుప్రసాద్, మౌలానా, వెంకన్న, ఉపేంద్ర, భాస్కర్, బాలు, స్వామి, మన్నె రాము, వెంకటేశ్వర్లు, కొత్తూరి మోహన్, సత్యేందర్, ఖాసీం, ప్రభాకర్, మధు, గోపాల్, శేఖర్, నర్సింహ, వీరబద్రం, బాలకృష్ణ, రమేశ్, వెంకటేశ్, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

మట్టపల్లి దేవస్థానానికి వాటర్ కూలర్ బహూకరణ

వాటర్ కూలర్ అందజేస్తున్న మేనేజర్లు బాలకృష్ణ , హనుమంతరెడ్డి

మఠంపల్లి, మే 19 : మండలంలోని మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి హుజూర్‌నగర్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మేనేజర్ బాలకృష్ణ, రీజనల్ బ్రాంచ్ ఖమ్మం మేనేజర్ వై.హనుమంతరెడ్డి రూ.50 వేలు విలువ గల 80 లీటర్ల వాటర్ కూలర్‌ను ఆదివారం బహూకరించారు. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, ఆర్య వైశ్య సంఘం గెల్లి విద్యాసాగర్, పాలిశెట్టి నర్సింహారావు, వీర్లపాటి మురళి, బోనాల శ్రీనివాస్, యూనియన్ బ్యాంక్ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరుమలగిరికి తరలిన బీఆర్ఎస్ నాయకులు

తుంగతుర్తి, మే 19 : ఉమ్మడి నల్లగొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో భాగంగా తిరుమలగిరిలో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ పట్టభద్రుల సమావేశానికి తుంగతుర్తి మండలం నుంచి సుమారు వంద మంది తరలివెళ్లినట్లు ఆ పార్టీ మండలాధ్యక్షుడు తాటికొండ సీతయ్య తెలిపారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. సమావేశానికి తరలివెళ్లిన వారిలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు గుండగాని రాములు, వైస్ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, తునికి సాయిలుగౌడ్, దొంగల శ్రీను, మట్టిపల్లి వెంకట్, గోపగాని శ్రీనివాస్, తునికి లక్ష్మీవెంకన్న, పూర్ణనాయక్ పాల్గొన్నారు.

నాగారం మండలం నుంచి..

నాగారం : తిరుమలగిరిలో జరిగిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశానికి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో ఎంపీపీ కూరం మణీవెంకన్న, వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, గుండగాని అంబయ్యగౌడ్, మండల అధికార ప్రతినిధి చిల్లర చంద్రమౌళి, కూరం వెంకన్న, ఈదుల కిరణ్ కుమార్, యారాల నర్సింహారెడ్డి, చిప్పలపల్లి సోమయ్య, మహేందర్, సత్తయ్య, అంజయ్య, సైదులు, మల్లేశ్, యాదగిరి, మురళి, చిరంజీవి, శేఖర్, ప్రేమయ్య ఉన్నారు.

మాఫియా కావాలా? మర్యాదస్తుడు కావాలా?

- బ్లాక్‌మెయిల్ వ్యాపారం చేసేటోడు మనల్నే బలిపెడతాడు
- రాకేశ్‌రెడ్డి అయితే సమస్యలపై నిలదీస్తాడు
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక సన్నాహక సమావేశంలో మాజీ మంత్రి, గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన ఎమ్మెల్సీ సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తదితరులు

కోదాడ : సమావేశానికి హాజరైన పట్టభద్రులు

సూర్యాపేట, (నమస్తే తెలంగాణ)/తిరుమలగిరి/కోదాడ, మే 19 : ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, అనతి కాలంలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కొంటున్నదని, అన్ని రంగాల ప్రజలు అసంతృప్తితో ఉన్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధిచెప్పే అవకాశం నేడు అన్ని వర్గాల పట్టభద్రులకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రవి మహల్ ఫంక్షన్‌హాల్, తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్ అలాగే కోదాడ పట్టణంలోని గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో నల్లగొండ-ఖమ్మం-వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాలకు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నెరవేర్చలేని హామీలు ఇచ్చి, మాయమాటలతో ప్రజలను మోసం చేస్తుందని దుయ్యబట్టారు. జాబ్ క్యాలెండర్‌తో పట్టభద్రులు, నిరుద్యోగులను మోసగించిన కాంగ్రెస్‌పై ఎమ్మెల్సీ ఎన్నికల్లో పగ తీర్చుకోవాలన్నారు. ఓ పక్క సోషల్ మీడియతో మాఫియాగా మారి బ్లాక్ మెయిలింగ్‌లతో వ్యాపారం చేసేవాడిని గెలిపిస్తే మనల్నే బలిపెడతాడని తెలిపారు. మరోపక్క మారుమూల పల్లెలో అతి సామాన్య కుటుంబంలో జన్మించి అమెరికా వెళ్లి అత్యున్నత చదువులు చదివి అన్ని వర్గాలపై పూర్తి అవగాహన పెంపొందించుకున్న మంచివాడు, మర్యాదస్తుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి శాసనమండలికి పంపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలపై నిలదీస్తాడన్నారు. కాంగ్రెస్, బీజేపీకి అధికారమే తప్పా ప్రజల అవసరాలు, కష్టసుఖాలు పట్టవన్నారు. పదేండ్ల పాలనలో కేసీఆర్ వందేళ్ల అభివృద్ధి చేసి చూపించినట్లు తెలిపారు. బీజేపీ 20 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి 40 కోట్ల మంది ఆకలితో అలమటించేలా చేసిందని దుయ్యబట్టారు. రైతుల వడ్లు ఎందుకు కొనడం లేదని ప్రభుత్వాన్ని ఆయన ప్రశ్నించారు. గతంలో ప్రతి గింజా కొన్నాం. నేడు రైతులు ధర్నాలు చేయాల్సి దుస్థితి ఎందుకు నెలకొన్నదన్నారు. రైతు బంధు అడిగితే చెప్పుతో కొట్టాలని ఒక మంత్రి అంటడు. ఐదు నెలల్లోనే రేవంత్‌రెడ్డి ఐదు సంవత్సరాల నరకం చూపించినట్లు చెప్పారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకపోయినా పర్వాలేదు కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వాటిని కూడా కొనసాగించలేని దుస్థితిలో రేవంత్ ప్రభుత్వం ఉందన్న విషయాన్ని పట్టభద్రులైన నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులతో పాటు ప్రైవేట్ ఉద్యోగులు అంతా గమనించాలని కోరారు. నిరుద్యోగులకు 4 వేల భృతి ఏమైంది? అన్ని హామీలు తుంగలో తొక్కారు. అభివృద్ధి, సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమన్నారు. ఈ 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాకేశ్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు.

కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ నంబర్ వన్ కోదాడ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక లక్ష 31 వేల ఉద్యోగాల ఖాళీలను భర్తీ చేసి దేశంలోనే కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నంబర్ వన్‌గా నిలిచిందని తెలిపారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీని కూడా నిలబెట్టుకోలేదని విమర్శించారు. నియోజకవర్గ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి అత్యధిక మెజార్టీ సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికా యుగేంధర్‌రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్, టీఆర్ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, రాంచందర్‌నాయక్, సూర్యాపేట మున్సిపల్ ఛైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, గండూరి ప్రకాశ్, నెమ్మాది భిక్షం, జీడి భిక్షం, అంగిరేకుల నాగార్జున, మర్ల చంద్రారెడ్డి, నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి కటికం సత్తయ్యగౌడ్, బెజవాడ శ్రావణ్, నాగరాజు, కవిత, తొగరు రమేశ్, సైదులు, కందిబండ సత్యం, మామిడి రామారావు, ఆంజనేయులు, నర్సిరెడ్డి, మల్లెల బ్రహ్మయ్య, నయీం, జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, పీఏసీఎస్ చైర్మన్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : సమావేశానికి హాజరైన పట్టభద్రులు

ప్రశ్నించే గొంతుకా? తడి బట్టతో గొంతు కోసేవాడా? : ఆర్.ఎస్ ప్రవీణ్‌కుమార్

విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ నిరుద్యోగ సమస్యలపై పెద్దల సభలో తన గొంతుకతో ప్రభుత్వాన్ని నిలదీసి ప్రశ్నించి, సమస్యలు పరిష్కరించే ఏనుగుల రాకేశ్‌రెడ్డి కావాలా? లేక బెదిరింపులు, బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు గుంజడం, మహిళల ఫొటోలు మార్ఫింగ్ చేసి, అవమానించడం తదితర 56 క్రిమినల్ కేసులతో తడిబట్టతో గొంతులు కోసే తీన్మార్ మల్లన్న కావాలో ఈ నెల 27న జరుగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తేల్చుకోవాల్సింది పట్టభద్రులేనని బీఆర్ఎస్ నేత, మాజీ ఐపీఎస్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కోదాడ పట్టణంలోని స్థానిక గునుగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కోదాడ నియోజకవర్గ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. బిట్స్ బిలానీలో బంగారు పతకం సాధించి, అమెరికాలో లక్షలాది రూపాయల వేతనంతో ఉన్నత ఉద్యోగం చేసిన రాకేశ్‌రెడ్డి సొంత గడ్డపై మమకారంతో ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ఉద్యోగం సైతం వదిలి రాజకీయాల్లోకి వచ్చినట్లు తెలిపారు. గురుకుల పాఠశాలల్లో విద్యార్థినీలు ఆత్మహత్యలు చేసుకుంటే ఆ శాఖకు బాధ్యత వహిస్తున్న సీఎం కనీసం పరామర్శించలేదని, ఆ అంశంపై సదరు బ్లాక్‌మెయిలర్ ఎందుకు ప్రశ్నించలేదో అర్థం చేసుకోవాలన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పక్షాన పోటీ చేస్తున్న రాకేశ్‌రెడ్డికి పార్టీలకు అతీతంగా ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు.

ప్రజల పక్షాన నిలబడుతా : రాకేశ్‌రెడ్డి

కోదాడ : సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యేలు జగదీశ్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య

ఉమ్మడి నల్లగొండ పోరాటాల గడ్డ. ఇక్కడి ప్రజలు ఎంతో చైతన్యవంతులు. నాలుగుసార్లు వరుసగా బీఆర్ఎస్‌ను గెలిపించిన చరిత్ర. ఆ స్థానం నుంచే మళ్లీ తనకు పోటీచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డి అన్నారు. పెద్దల సభకు మేధావులను పంపించాలి తప్ప మోసగాళ్లను కాదన్నారు. అసత్య హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ను నమ్మొద్దన్నారు. సమాజంలో అన్ని వర్గాల ప్రజలతో పాటు నిరుద్యోగులు, ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగులందరి సమస్యల పట్ల పూర్తి తనకు అవగాహన ఉన్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు జాబ్ క్యాలెండర్ లేదు. ప్రశ్నించే గొంతుక కావాలా? ప్రశంసించే గొంతుక కావాలో ఎంచుకోవాలన్నారు. ప్రజల పక్షాన పోరాటమే లక్ష్యంగా పనిచేస్తానని తనను గెలిపిస్తే ప్రశ్నించే గొంతుక అవుతానన్నారు. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపిస్తే అతను పట్టభద్రుల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నించగలడా ఆలోచించాలన్నారు. గెలిస్తే తన వేతనం కూడా పట్టభద్రుల సమస్యల కోసమే ఖర్చు చేస్తానని తెలిపారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి తనకు మొదటి ప్రాధాన్యత ఓటు ఇచ్చి గెలిపించాలని ఆయన కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

రాజాపేట : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భువనగిరి అర్బన్ : సత్యవతి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

ఆలేరు రూరల్ : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొమ్మలరామారం : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆలేరు రూరల్, మే 19 : మండలంలోని కొలనుపాక హైస్కూల్‌కు చెందిన 2007-2008 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఏవీఎన్ గార్డెన్స్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను సత్కరించారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరారెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సత్యవతి, పద్మకుమారి, వెంకటేశ్, మల్లేశ్, పద్మారావు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజాపేట : మండలంలోని పారుపల్లి హైస్కూల్‌లో 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోవర్ధన్‌రెడ్డి, గౌస్, సంజీవులు, సుదర్శన్, భాస్కర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

భువనగిరి అర్బన్ : మండలంలోని అనంతారం హైస్కూల్‌కు చెందిన 1986-2004 బ్యాచ్‌ల పూర్వ విద్యార్థుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం భువనగిరిలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 40 వసంతాల క్రితం విడిపోయిన వారు నేడు మళ్లీ కలుసుకోవడంతో వారిలో ఆనందం ఉప్పొంగింది. ఈ సందర్భంగా నాటి గురువులను సన్మానించారు. 1992-93 బ్యాచ్‌కు చెందిన సత్యవతి ఇటీవల మృతి చెందడంతో ఆమె కుటుంబానికి రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ సలీం, ఉపాధ్యాయులు విద్యాసాగర్‌రావు, మల్లేశం, బాల్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు నాగరాజు, పక్కీర్ కొండల్‌రెడ్డి, శ్రీశైలం, శ్రీహరి, మదిరె మల్లేశం, బోయిని మల్లేశం, చందు పాల్గొన్నారు.

బొమ్మలరామారం : మండలంలోని జలాల్‌పూర్ హైస్కూల్‌కు చెందిన 1995-96 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు పాఠాలు బోధించిన గురువులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి

బొడ్రాయిబజార్ : సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

బొడ్రాయిబజార్, మే 19 : స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, దక్షిణ భారత కమ్యూనిస్ట్ ఉద్యమ నిర్మాత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం స్థానిక ఎంవీఎన్ భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సుందరయ్య ఆశయ సాధన కోసం అంతా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి, నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, ఎల్గూరి గోవింద్, మేకనబోయిన శేఖర్, దండ వెంకట్‌రెడ్డి, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, కొప్పుల రజిత, చినపంగ నర్సయ్య, ముల్కలపల్లి రాములు, వినోద్ పాల్గొన్నారు.

మోతె : పీడిత ప్రజల ప్రియతమ నేత పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ఆదర్శం, ఆచరణీయమని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి ములుకూరి గోపాల్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం ఆధ్వర్యంలో నేరేడుచర్లలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అరిబండి భవన్‌లో ఆయన చిత్రపటానికి పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కొదమగుండ్ల నగేశ్, ఆనగంటి మీనయ్య, నీలా రాంమూర్తి, మొగిలిచర్ల రుద్రమ్మ, పాతూరు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మేళ్లచెర్వు : మేళ్లచెర్వులో సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆధునిక రాజకీయాల్లో విలువలు పాటించిన నాయకుడిగా ఆయనను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి వట్టెపు సైదులు, ప్రజా సంఘాల మండల నాయకులు ఆదినారాయణ, సైదులు, అశోక్, నరసింహారావు, జగన్, శ్రీను, సామేలు పాల్గొన్నారు.

నూతనకల్ : సుందరయ్య ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కాందాల శంకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చిల్పకుంట్ల గ్రామంలో సుందరయ్య వర్ధంతిని నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు తొట్ల లింగయ్య, బానాల విజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ : పేదల పెన్నిది కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకట్ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు దుగ్గి బ్రహ్మ, శీలం శ్రీను, వట్టేపు సైదులు, జక్కుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ రూరల్ : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాల సాధనకు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పోసనబోయిన హుస్సేన్ అన్నారు. మండలంలోని గోపాలపురంలో ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్య, భిక్షం పాల్గొన్నారు.

పాలకవీడు : సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంలో సీపీఎం నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి అనంతప్రకాశ్, ఎంపీటీసీ దొంగల వెంకటయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పగడాల మట్టేశ్ పాల్గొన్నారు.

మునగాల : సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంతో పాటు, కొక్కిరేణి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బుర్రి శ్రీరాములు, మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, చందా చంద్రయ్య, స్టాలిన్‌రెడ్డి పాల్గొన్నారు.

నడిగూడెం : పుచ్చలపల్లి సుందరయ్య ఆశయాలు సాధించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. నడిగూడెంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ కొరట్ల శ్రీనివాస్, ఏనుగుల వీరాంజనేయులు, బీరెవెల్లి సుధాకర్‌రెడ్డి, మామిడి వీరబాబు, మండవ నర్సయ్య, కాసాని మధు పాల్గొన్నారు.

గరిడేపల్లి : పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి యాకూబ్ వీరయ్య, వీరారెడ్డి, సంతోశ్, నాగమణి, మట్టయ్య, రాములు, రమణ పాల్గొన్నారు.

వానకాలం సాగుకు రైతు భరోసా అందజేయాలి

- బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

పాలకవీడు, మే 19 : వానకాలం సాగుకు సంబంధించి రైతులకు ప్రభుత్వం రైతు భరోసా అందజేయాలని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు తాటికొండ వెంకట్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. వానకాలం సాగుకు సంబంధించి రైతులు వ్యవసాయ పనులు ప్రారంభించారని, గత ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.7 వేల చొప్పున రైతు భరోసా నిధులు విడుదల చేసి ఆదుకోవాలన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలను అందుబాటులో ఉంచాలని, 24 గంటల పాటు నాణ్యమైన కరెంట్‌ను సరఫరా చేయాలని పేర్కొన్నారు.

సూర్యాపేట బిల్డర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

సూర్యాపేట సిటీ, మే 19 : సూర్యాపేట జిల్లా బిల్డర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం జిల్లా కేంద్రంలోని వీ.ఎస్.రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. గౌరవాధ్యక్షుడిగా ఎల్గూరి పాండుగౌడ్, ముఖ్య సలహదారుగా వరిపెల్లి లక్ష్మయ్య, అధ్యక్షుడిగా కాసర్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఖమ్మంపాటి జానయ్య, ఉపాధ్యక్షులుగా బరిశెట్టి శ్రీనివాస్, పన్నాల ఉపేందర్‌రెడ్డి, కోశాధికారిగా పాతూరి మణిపాల్, సంయుక్త కార్యదర్శిగా షేక్ సలీం ప్రమాణ స్వీకారం చేశారు.